క్లుప్తంగా

గోదాగోకులంలో తిరుప్పావడ సేవ

కర్నూలు(సెంట్రల్): గోదా గోకులంలో గురువారం ఉదయం 10 గంటలకు స్వామి వారికి తిరుప్పావడ సేవను నిర్వహించారు. పూజారి నాగరాజు ఆధ్వర్యంలో పులిహోరను రాశిగా పోసి ఒక రూపంలాగా తయారు చేస్తారు. దద్ధోజనం, వడలు, అప్పాలు, లడ్డూలతో పాటు పలు రకాల వంటకాలను స్వామిరి సమర్పించారు. ఈ సేవను అన్నకూటోత్సవం అని అంటారని పూజారి నాగరాజు అన్నారు. ధనుర్మాసంలో ఒక గురువారం ఈ సేవను పాటిస్తే మంచిదని ఆయన వివరించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక బుధవారపేటలోని పేద మహిళలకు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భిన్నమతాలు, భిన్న సంస్కృతులు మన దేశంలో ఉన్నాయని, ఇది ప్రపంచానికి ఆదర్శప్రాయమన్నారు. ఎవరు ఏ మతంలో ఉన్నా ఇతరుల మతాన్ని గౌరవించాలన్నారు.

కర్నూలు చేరుకున్న అయోధ్య రాముడి రథయాత్ర



కర్నూలు చేరుకున్న రథయాత్రకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): దేశంలోని అన్ని నదుల జలాలు, మట్టిని సేకరించే ఉద్దేశంతో ప్రారంభమైన అయోధ్య రాముడి రథయాత్ర గురువారం కర్నూలు చేరుకుంది. అయోధ్యలోని రామమందిరం నుంచి బయలుదేరిన ఈ రథయాత్ర తిరిగి అక్కడికే వెళ్తుంది. ఈక్రమంలో గురువారం కర్నూలు జిల్లా చేరుకోవడంతో ధార్మిక సంఘాల ప్రతినిధులు ధార్మిక నాగేశ్వరరావు, మురళీ, మహాబలేష్ నాగోజీరావు, లక్ష్మయ్య స్వాగతం పలికారు. నగరం సమీపంలోని తుంగభద్ర జలాలు, మట్టిని సేకరించి వారికి అందజేశారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షోమ బోర్డు నుంచి రూ.850 కోట్లను దారి మళ్లించారని, నిధులను తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేయాలన్నారు.

వైద్యులు టీచింగ్ మెలకువలు నేర్చుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): వైద్యులు తప్పనిసరిగా టీచింగ్ మెలకువలు నేర్చుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సూచించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు గురువారం మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో వైద్యులకు మూడు రోజుల బీసీఎంఈ కోర్సు నిర్వహించారు. బోధనలో నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకునేలా శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంసీ అబ్జర్వర్ డాక్టర్ శృతి, ఎస్‌పీఎం ప్రొఫెసర్ డాక్టర్ సింధియా తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీని విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీని విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిరుద్యోగులతో కలిసి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటి వరకు డీఎస్సీని విడుదల చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎంతో మంది నిరుద్యోగులు వేచి ఉన్నారన్నారు. జాబ్ క్యాలెండర్ అమలు చేసినా అందులో డీఎస్సీ లేకపోవడం అన్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, హుస్సేన్‌బాషా, గోవర్ధన్, వీరేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి

కర్నూలు (అర్బన్): విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే మధుసూదనరావు కోరారు. స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు గ్రూప్ -2 (ప్రిలిమనరీ) పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు ఫీజు రూపంలో చెల్లించి తీసుకునే శిక్షణను రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు ఉచితంగా అందిస్తోందన్నారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ పీ వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ఇప్పటి వరకు 232 దరఖాస్తులు రాగా 80 మంది అభ్యర్థులు ప్రవేశం పొందారన్నారు. 45 రోజుల శిక్షణానంతరం మెటీరియల్, స్టైఫండ్ అందజేస్తామన్నారు. ట్రైనీ బీసీ సంక్షేమ సాధికారత అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, కార్యక్రమంలో స్టడీ సర్కిల్ కోర్సు కో ఆర్డినేటర్ బీ విజయభాస్కర్, లైబ్రేరియన్ యుగంధర్‌గౌడ్ పాల్గొన్నారు.



పార్క్ ముఖద్వారం




ఆకట్టుకుంటున్న కుందేళ్ళు, చిన్నారుల చిత్రాలు

వనం.. అపు'రూపం'.!

అలజడి విని పరుగులు తీసేందుకు సిద్ధంగా ఉన్న ఉడుతలు.. గొంతెత్తి చూస్తున్న జిరాఫీలు.. అప్రమత్తమైన కొంగలు.. సుద్దులు చెబుతున్న తల్లి కుందేలు వద్ద చెవులు నిక్కపొడిచి వింటున్న పిల్ల కుందేలు.. పించం విదిల్చి పైకెగురుతున్నట్లున్న నెమలి.. నేల నుంచి నింగికెగిసి పడుతున్న నీటి ధారలు.. ఇవే కాదు మిరిమిట్లు గొలిపే లైట్లు.. జీవం ఉట్టిపడేలా జంతువుల బొమ్మలు కర్నూలు మహా నగరం నడిబొడ్డున శ్రీపొట్టి శ్రీరాములు చిల్డ్రన్స్ పార్క్‌లో కనువిందు చేసే దృశ్యాలు. రూ.1.20 కోట్లు వెచ్చించి పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం ప్రారంభానికి నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫైబర్‌తో తయారు చేసిన చెట్లు, మొక్కలు, కుందేలు, జింక, పక్షులు, రంగు రంగుల లైట్లతో వాటర్ ఫౌండేన్లు సినిమా సెట్టింగ్‌ను తలపిస్తున్నాయి. చిన్నారుల కోసం ఊయల, జారుడు బండ ఏర్పాటు చేశారు. తామర పువ్వులు అబ్బుర పరుస్తున్నాయి. చిన్న, చిన్న పార్టీలు, బర్త్‌డే ఫంక్షన్లు, కిటీ పార్టీలు చేసుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



వాటర్ ఫౌంటేన్




విద్యుత్ వెలుతురులో జిరాఫీలు, కొంగలు



వ్యాయామ పరికరాలు



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన జారుడు బండ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఉంటుందని కర్నూలు ఈఈ (ఆపరేషన్) పి.ఓబులేసు గురువారం తెలిపారు. జొహరాపురంలోని విద్యుత్ లైన్ మార్పు చేసే పనుల నిమిత్తం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. లక్ష్మీగార్డెన్స్, మారుతీహోమ్స్, హార్ట్ అండ్ బ్రెయిన్ సెంటర్, సూర్య హాస్పిటల్, ఎల్‌బీజీ నగర్, ఇంటెలిజెన్స్ బ్యూరో ఆఫీసు ఏరియా, జొహరాపురం రోడ్డు పరిసరాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

జనవరి 3న మహిళ టీచర్స్ డే నిర్వహించాలి

కర్నూలు సిటీ: సావిత్రి బాయిపూలే జయంతిని పురస్కరించుకుని జనవరి 3న మహిళా టీచర్స్ డే నిర్వహించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డి.రామశేషయ్య, నాయకులు బి.సుధాకర్, తదితరులు గురువారం డీఈఓ డా.వి రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసనలు

కర్నూలు(సెంట్రల్): తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. 17వ రోజు శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో కబడ్డీ ఆడి వినూత్నంగా నిరసన తెలిపారు. సమ్మెకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్పతో పాటు నాయకులు ఆర్.నరసింహులు, చంద్రశేఖర్, ఏసురత్నం, దివాకర్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఎస్.మునెప్ప, మహ్మద్‌రఫీ, చంద్రశేఖర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రాముడు తదితరులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటిని ముట్టడించారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

9వ రోజు కొనసాగిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రంగన్న డిమాండ్ చేశారు. 9వ రోజు శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో వినూత్నంగా వంటావార్పు కార్యక్రమంతో నిరసన తెలిపారు.

ఉపాధికి గండి కొట్టొద్దు

కర్నూలు(సెంట్రల్): ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టి ఆటో కార్మికుల ఉపాధికి గండి కొట్టొద్దని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉచిత పథకంతో ఆటో వర్కర్స్ బతుకులు దయనీయంగా మారుతాయని, తెలంగాణ, కర్ణాటకల్లో చూసైనా ఏపీలో ప్రవేశపెట్టే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, నాగరాజు, ఈశ్వరరెడ్డి, జయరాంరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

తెలంగాణ తరహాలో పేస్కేలు అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): వీఆర్‌ఏలకు తెలంగాణ తరహాలో పేస్కేలు అమలు చేయాలని ఏపీ వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఒక్కో వీఆర్‌ఏ నుంచి రూ.19,500 రికవరీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అన్యాయమన్నారు. కొందరు ట్రెజరీ అధికారులు రికవరీ సొమ్మును చెల్లించకపోతే జీతాల బిల్లులు పెట్టడంలేదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

కర్నూలు (లీగల్): ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం, జీవో నెం.512ను వెంటనే రద్దు చేయాలని ధర్నా చౌక్‌లో న్యాయవాదుల చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం కొనసాగాయి. దీక్షలో న్యాయవాదులు వసుంధర దేవి, షభానా, సమీరా షాహిన్, సరోజ, కృష్ణ, మురళీమోహన్, శివప్రసాద్, రేవతి, వీరా ప్రియాంక, బాషా ఖాద్రి, అబిద్ హుసేన్ కూర్చున్నారు. శిబిరానికి కాంగ్రెస్ నాయకులు కరుణాకర్ సంఘీభావం తెలిపారు.

కర్నూలు (టౌన్): మూడో రోజు గురువారం ఆడుదాం-ఆంధ్రా పోటీలు కొనసాగాయి. స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల, టౌన్ మోడల్ ఉన్నత పాఠశాల, కోల్స్ కళాశాల తదితర మైదానాల్లో ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు తలపడ్డారు. ఆడుదాం-ఆంధ్రా నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు కూడా క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమన్నారు.

స్కోర్ వివరాలు

చిదంబరరావు వీధి సచివాలయం: మహిళల బ్యాడ్మింటన్ పోటీల్లో శ్రీగీత, అంజలి జట్టు 15–08, 15–07 స్కోర్‌తో శివానీ, వాణీ జట్టుపై గెలుపొందారు.

కల్లా సచివాలయం: సానియా ఖాతూన్, సానియా తబస్సుం జోడీ 15-07, 15-11 స్కోర్‌తో రాణి, ప్రణతి జోడీపై గెలుపొందారు.

పురుషుల విభాగం: మోహన్‌కుమార్, వినీత్ జట్టు 21-18 స్కోర్‌తో ప్రత్యర్థి మాలిక్, సుహేయిల్ జట్టుపై గెలిచారు. మహిళల కబడ్డీలో సీరానీ జట్టు 16-11తో షభానా జట్టుపై, పురుషుల విభాగంలో శివన్న జట్టు 25-19 పాయింట్ల తేడాతో కార్తీక్ జట్టుపై విజయం సాధించారు.

కొనసాగుతున్న క్రీడాపోటీలు



కబడ్డీలో పోటీపడుతున్న మహిళా జట్లు

రక్తదాన శిబిరం

కర్నూలు(హాస్పిటల్): డేనియల్ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ నగర్‌తో పాటు తాడిపత్రి, అనంతపురం, విజయవాడ, హైదరాబాద్, గద్వాల, ఆదోని, నంద్యాలలోనూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకులు సుమన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలన్న ఆలోచనతో తలపెట్టిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు(సెంట్రల్): భారతదేశానికి స్వాతంత్రాన్ని తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి కొండారెడ్డి బురుజు సమీపంలోని పార్కులో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి పార్టీ కార్యాల యం చేరుకొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయంలో దేశనాయకుల ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.సుధాకరబాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, నాయకులు బతుకన్న, పోతు శేఖర్, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

నగరంలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో జరిగే శస్త్రచికిత్సలను ఇక్కడి వైద్యులు అవలీలగా చేసేస్తున్నారు. అక్కడి కంటే ఇక్కడ మిన్నగా వైద్యుల చికిత్సతో పాటు నర్సింగ్ సేవలు అందుతున్నాయి. ఒకప్పుడు అడ్మిషన్ అయితే ఎన్నో రోజులకు ఆపరేషన్ చేసే పరిస్థితి నుంచి ఇప్పుడు అడ్మిషన్ అయిన రెండు, మూడు రోజుల్లోనే ఆపరేషన్ చేసి ఇంటికి పంపిస్తున్నారు. త్వరలో మూగ, చెవిటి పిల్లలకు చేసే కాక్లియర్ ఇన్‌ప్లాంట్ సర్జరీలు సైతం ప్రారంభం కాబోతున్నాయి. – కర్నూలు(హాస్పిటల్)

ఈఎన్‌టీ వైద్యసేవలు భళా!

- అవసరమైతే వెంటనే అడ్మిషన్
- చేరిన రెండు రోజుల్లోనే ఆపరేషన్
- త్వరలో కాక్లియర్ ఇన్‌ప్లాంట్ సర్జరీలు
- ప్రైవేట్‌కు మిన్నగా ఈఎన్‌టీలో వైద్యసేవలు
- రూ.2.5 కోట్లతో మైక్రోస్కోప్ మిషన్ ఏర్పాటు



ఈఎన్‌టీ విభాగం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) విభాగంలో రెండు యూనిట్లు ఉన్నాయి. ప్రతి యూనిట్‌కు ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చొప్పున మొత్తం 8 మంది పనిచేస్తున్నారు. వీరితో పాటు 20 మంది పీజీలు వైద్యవిద్యను అభ్యసిస్తూ సేవలందిస్తున్నారు. ఇక్కడ గత ఏడాది వరకు 6 పీజీ సీట్లు మాత్రమే ఉండేవి. ఇటీవల కాలంలో రెండు పీజీ సీట్లు అదనంగా రావడంతో సీట్ల సంఖ్య 8కి చేరుకుంది. ఈ విభాగంలో ఓపీ సోమవారం నుంచి శనివారం వరకు ఉంటుంది. ప్రతిరోజూ 150 నుంచి 200 మంది వరకు చికిత్స కోసం వస్తారు. గత ఏడాది ప్రభుత్వం రూ.2.5 కోట్లతో మైక్రోస్కోప్ కొని పంపింది. దీని ద్వారా అత్యాధునిక ఆపరేషన్లు ఎంతో సులభంగా నిర్వహిస్తున్నారు. త్వరలో కాక్లియర్ ఇన్‌ప్లాంట్(పుట్టుకతో మూగ, చెవుడు ఉన్న వారికి) ఆపరేషన్లు నిర్వహిస్తారు. మూడేళ్లలోపు వయస్సు ఉంటే రెండు చెవులకు, ఐదేళ్లలోపు ఐదే ఒక చెవికి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆరోగ్యశ్రీకి రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. మరో రెండు, మూడు నెలల్లో ఈ ఆపరేషన్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ప్రైవేటులో ఈ ఆపరేషన్‌కు రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు చార్జ్ చేస్తారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో పాటు కొన్ని రకాల ఆపరేషన్ చేసుకున్న రోగులకు ఖరీదైన ఆంఫోటైసిన్-బి ఇంజెక్షన్లు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. రోగికి పదిరోజుల పాటు రోజుకు ఒకటి చొప్పున వీటిని వేస్తారు. ఒక్కో దాని ధర రూ.5 వేల చొప్పున ఒక్క రోగికి రూ.50 వేలు ఖర్చు చేస్తున్నారు. 2021లో 904, 2022లో 2,186, 2023లో 1,970 శస్త్రచికిత్సలు నిర్వహించారు.



ఈఎన్‌టీ విభాగంలోని ఓపీ

ఈఎన్‌టీ విభాగంలో నిర్వహిస్తున్న సర్జరీలు

చెవిలో చీము కారడం, చెవి రంధ్రాలు పడినప్పుడు సర్జరీ చేస్తారు. దీంతో పాటు కొలిస్టిటోమా, ముక్కు నాసల్ పాలిప్స్, ముక్కు దూలం సరిచేయడం, మ్యూకార్, బ్లాక్ ఫంగస్, అలర్జీ సర్జరీలు, ఎండోస్కోపిక్ ద్వారా డీసీఆర్ ఆపరేషన్లు, గొంతు గిలగిలు, క్యాన్సర్‌కు ట్రకాస్టమీ, క్యాన్సర్ కణితుల బయాప్సీ తీయడం, స్వరపేటిక ఆపరేషన్, థైరాయిడ్ కణితి ఆపరేషన్లు చేస్తున్నారు.


ఆరేళ్లలో ఓపీ రోగుల వివరాలు

సంవత్సరం	కొత్త ఓపీ కేసులు	పాత ఓపీ కేసులు	మొత్తం
2018	41,039	11,978	53,017
2019	40,248	12,736	52,984
2020	10,518	3,031	13,549
2021	24,197	9,953	34,150
2022	34,460	13,259	47,719
2023	38,860	15,090	53,950



ఓపీలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు


త్వరలో కాక్లియర్ ఇన్‌ప్లాంట్ సర్జరీలు



ఇప్పటి వరకు రాష్ట్రంలో ఒకటి, రెండు చోట్ల మాత్రమే నిర్వహించే కాక్లియర్ ఇన్‌ప్లాంట్ సర్జరీలు త్వరలో ఇక్కడ ప్రారంభించనున్నాం. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మరో రెండు నెలల్లో సర్జరీలు ప్రారంభిస్తాం. ప్రైవేటులో ఈ ఆపరేషన్‌కు రూ.6 లక్షలకు పైగా ఖర్చవుతుంది. పుట్టుకతో మూగ, చెవుడు ఉన్న చిన్నారులకు ఈ ఆపరేషన్ నిర్వహిస్తాం. ఇటీవల రెండు పీజీ సీట్లు రావడం వల్ల ప్రస్తుతం 20 మంది పీజీలు ఉన్నారు. కొన్ని రకాల ఆపరేషన్లు చేయించుకున్న రోగులకు ఖరీదైన ఇంజెక్షన్లు ఉచితంగా వేస్తున్నాం.

– డాక్టర్ సీవీ రావు, హెచ్ఓడీ, ఈఎన్‌టీ విభాగం, జీజీహెచ్, కర్నూలు


వసతులు, సౌకర్యాలు బాగున్నాయి



మాది కర్నూలు. నాన్న అన్వర్ టైల్స్ పని చేస్తాడు. అమ్మ నబియా గృహిణి. నాకు గొంతులో గవదబిళ్లలు అయ్యింటే గత శుక్రవారం అడ్మిట్ అయ్యాను. మంగళవారం డాక్టర్లు ఆపరేషన్ చేశారు. అంతా ఆరోగ్యశ్రీలో చేశారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదని మా అమ్మ చెప్పింది. వార్డులో వసతులు, సౌకర్యాలు బాగున్నాయి.

– సుఫియాన్, కర్నూలు

డాక్టర్లు బాగా వైద్యంచేశారు



మాది నందికొట్కూరు టౌన్. నా భర్త అబ్దుల్లా గౌండా పనిచేస్తాడు. నేను ఇంటి వద్దే ఉంటాను. మాకు ముగ్గురు పిల్లలు. నాకు చెవిలో రంధ్రం ఉంటే ఇటీవల ఆసుపత్రిలోని ఈఎన్‌టీ విభాగంలో చేరాను. గత శుక్రవారం డాక్టర్లు నాకు ఆపరేషన్ చేశారు. ఇప్పుడు చెవి బాగా వినిపిస్తోంది. డాక్టర్లు కూడా వైద్యం బాగా చేశారు.

– రేష్మ, నందికొట్కూరు